శ్రీ ఎమ్. పార్థసారథి

# మనిషి-పశువు

## (ఒక ఇంటర్వ్యూ)

గౌరి మీ కేమవుతుంది ?

అదేమిటీ అలా అడుగుతారు ! అది మా అమ్మాయి.

ఆమెలో ఈ లోపం వుందని మీ రెప్పుడు మొదటిసారిగా తెలుసుకున్నారు ?

ఏమో ! నాలుగైదేళ్ల దాకా అసలు మేం పట్టించుకోనే లేదు. ఐనా బాబూ, మేమేం చదువుకున్న వాళ్లమా ఏమన్నానా, ఉండేదేమో ఈ పల్లెటూళ్లోనాయె ఎవర్నడిగినా, లోపమేమీ లేదు. ఎదుగుతుంటే అంతా అదే సర్దుకుంటుందిలే అన్నారు.

ఆ లోపం నయం చేయించటానికి మీరేమైనా ప్రయత్నం చేశారా ?

ఒకటి రెండుసార్లు హైద్రాబాద్‌లో డాక్టర్లకు చూపించాం. వాళ్ళూ చూసి, ఇది మందులవల్ల తగ్గేదికాదు, మంచి ట్రెయినింగ్ యివ్వాలి అంటో ఏదో చెప్పారు. అక్కడికీ తృప్తి పడక ఏవేవో దేశవాళీ మందులు కూడా వాడేం. కాని ఏమీ నయంకాలేదు.

గౌరి ఏమైనా చదువుకుందా ?

ఇలాంటి దానికి చదువు మాత్రమెలా అంటుతుందీ ? దానికి తెలిసేటట్టు చెప్పటానికి ఏ టీచరుకు మాత్రం ఓపికుంటుంది ? పది పన్నెండేళ్లదాకా అట్లాగే స్కూలుకు పంపించాం. అదేదో క్లాసులన్నీ పాసైందని కాదు. పిచ్చి మాలోకం—విన్నవి, మనసుకు పట్టినవి వూరికే నెమరేసుకుంటూ వుండేది.

డాక్టర్లకు చివరిసారిగా ఎప్పుడు చూపించారు ?

దానికి పెళ్లై పదేళ్లయిందా, పెళ్లికి ముందర ఓ సారి చూపించాం. అదీ, అబ్బాయి తరఫువాళ్లు, యిది కాక యింకేమైనా లోపముందేమోనని అనుమాన పడితే, వాళ్ల తృప్తికోసం

మరి యిలాంటి అమ్మాయికి పెళ్లి సంబంధాలు చూడటానికి యిబ్బంది కలగలేదూ ?

సరే, ఏం చెప్పమంటారు. పొలం సగానికిపైగా దాని పెళ్లి కోసమే హరించుకుపోయింది. ఎన్ని సంబంధాలు చూశామని. చివరికి దేవుడిలాగా ఈ అబ్బాయి కనిపించాడు లేకపోతే ఏమయ్యేదో! చదువుకున్నవాడు, సంస్కారవంతుడు ఐనా యిలాంటి దాన్ని చేసుకోవటానికి ఒప్పుకున్నాడంటే కలియుగంలో శ్రీరామచంద్రుడన్నమాటే. ఆ అబ్బాయి తల్లిదండ్రులు – కట్న మిచ్చామని వాళ్లను దూషిస్తామనుకోకండి. ఇలాంటి దాన్ని కట్నంతో మాత్రం చేసుకోవటానికి ఎవరు ముందుకొస్తారు !

అక్కడ, వాళ్లు మీ అమ్మాయిని ఎలా చూస్తున్నారో తెలుసా ?

ఏం, ఏమైంది ?

వాళ్లందరూ, మీ అమ్మాయిని చాల నీచంగా చూస్తున్నారు, శ్రీరామచంద్రుళ్లాంటి మీ అల్లుడు రాఘవరావుతో సహా, ఆది దంపతుల్లాంటి మీ వియ్యంకుడు, వియ్యపురాలితో సహా. చివరికి లవకుశుల్లాంటి మీ మనమలు కూడా తల్లి అనే యింగితమైనా లేక ...


భారతి

చందా వివరములు

| | ఏజంటుద్వారా | పోస్టులో |
|---|---|---|
| విడి ప్రతి | రు. 1-50 | - |
| 6మాసములచందా | రు. 9-00 | 9-60 |
| సంవత్సరచందా | రు. 18-00 | 19-20 |

ఒకేసారి ఆంధ్రపత్రిక ఆఫీసుకు నేరుగా చెల్లిస్తే సంవత్సరచందా 12-00

మేనేజరు

భారతి

ఏమంటారు ?

మీ అమ్మాయికి ఎదురు చెప్పటం తెలియదు. దానికి తోడు పనిలో కూడా మెతక. వాళ్ళామెను ఎన్ని రకాల తిడతారో, అవమానిస్తారో ... ఒక్క దానికీ జవాబివ్వదు.

అయ్యో అలాగా నా తల్లి. ఐనా మొగుడన్నవాడెవడు కొట్టకుండా తిట్టకుండా వుంటాడు ?

మొగుడొక్కడే కాదు అత్తమామలు, చివరకు కన్న పిల్లలు కూడా అని చెప్పటం లేదూ !

ప్చ్ ! పోనివ్వండి. ఇప్పుడేమనుకుంటే ఏంలాభం. వాళ్ళింటి పిల్లైపోయింది. ఇప్పుడేం చేసినా అంతా వాళ్ళిష్టం.

దారుణం. తల్లిదండ్రులు కూడా యిలా మాట్లాడతారేమిటి ? సరే, అదంత నయం కాని జబ్బేమీ కాదు. నేను ఆమె జబ్బు నయం చెయ్యగలను. డబ్బులు కూడా ఎంతోకావు. ఒకటి రెండు నెలలు నా ట్రీట్‌మెంట్‌లో వుంచేచాలు.

డబ్బులదేముంది లెండిగాని, వాళ్ళపిల్లకు మేం ట్రీట్‌మెంట్ చేయిస్తే ఏం బావుంటుంది ? వాళ్ళనడగండి. దాని భర్తనడగండి. అంతా వాళ్ళిష్టం.

*    *    *

గౌరి ట్రీట్‌మెంట్ విషయం ఆమె తల్లిదండ్రుల్నడిగితే, వాళ్ళ మిమ్మల్ని సంప్రదించమన్నారు.

గౌరికి ట్రీట్‌మెంటా ? ఏం ట్రీట్‌మెంట్ ?

ఆమెను మామూలు మనిషిని చెయ్యటానికి.

మామూలు మనిషంటే, అందరూ ఒకే లాగుండరు. గౌరి మామూలుగా అలాగే వుంటుంది. పైగా అదేమన్నా యివాళొచ్చిందా ? పుట్టినప్పటి నుండీ అలాగే వుందిట. మా యింటికొచ్చినప్పుడు అలాగే వుంది.

ట్రీట్‌మెంట్ వల్ల ఆమె, విషయాలు త్వరగా గ్రహించగలుగుతుంది. మనుషుల్ని బాగా అర్థం చేసుకోగలుగుతుంది. బాగా ఎక్స్‌ప్రెస్ చెయ్యగలుగుతుంది.

ఇప్పుడు దానికేం లోపమొచ్చిందనీ. ఒక్కో మనిషి తరహా అంతే. ఇంటి పనులన్నీ చేస్తుంది. వంట చేస్తుంది. నీళ్ళు పడుతుంది. గేదెను కూడా అదే చూస్తుంది. కుక్కలకు స్నానం చేయిస్తుంది. భర్తకూ, పిల్లలకూ సాయంగా వుంటుంది. ఇంతకన్నా యింకేం కావాలి ! మీ చికిత్సతో మాటకు మాట ఎదురు చెప్పటం నేర్చుకుంటారా ? పని ఎగ్గొట్టటం నేర్చుకుంటారా ? సాధించటం నేర్చుకుంటారా ?

అదేమిటండీ, మామూలు మనిషైతే ఆవిడకు స్వంత వ్యక్తిత్వం వస్తుంది. ఆత్మగౌరవం అంటే ఏమిటో తెలుస్తుంది. పెద్దా చిన్నా భేదం తెలుస్తుంది. గౌరవం—అవమానం అంటే ఏమిటో గ్రహించగలుగుతుంది.

సరే, లే.

అదికాదండీ, పనులు చేసినంత మాత్రాన మామూలు మనిషై పోయిందా ? పెంపుడు జంతువులు మనుషులవుతాయా ? మనుషులకూ వాటికీ తేడా లేదూ ?

ఇదిగో డాక్టరూ ఇన్ని మాటలెందుకు ? అది వాడి పెళ్ళాం. వాడిష్టం. మమ్మల్నేమడగొద్దు.

హల్లో రఘూ, హౌ ఆర్ యూ ?

హల్లో. రండి. రండి. ఏమిటి విశేషం !

ఒక అద్భుతమైన మంచి వార్త చెప్పటానికి వచ్చాను.

చెప్పండి.

ఒక రెణ్ణెల్లు గౌరిని నా ట్రీట్‌మెంట్‌కు వదలిపెట్టు ఆ తరువాత చూస్కో ఎలా అవుతుందో !

గౌరికి ట్రీట్‌మెంటా ?

అవునయ్యా బాబూ, నీ సతీమణికే. ఐ విల్ మేక్ హర్ ఎ నార్మల్ పర్సన్.

కానీ ఆవిడకు జబ్బు లేందే ?

షి ఈజ్ మెంటల్లీ రిటార్డెడ్.

లేదండీ, అలా కనిపిస్తుంది కాని నిజానికి షి ఈజ్ ఆల్‌రైట్. చాలా అడ్జస్టింగ్ నేచర్. షి ఈజ్ వెరీ నైస్. ఇంటి పనులన్నీ చక్కగా ఓపిగ్గా చేసుకుంటుంది. అయామ్ పర్‌ఫెక్ట్‌లీ సాటిస్‌ఫైడ్ విత్ హర్.

రియల్లీ ?

యస్. ఐ డోంట్ వాంట్ ఎనీథింగ్ మోర్ ఫ్రం హర్.